క్లుప్తంగా

ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం


రక్తదానం చేస్తున్న లక్ష్మీనాగేంద్ర

బోట్‌క్లబ్: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఒక గర్భిణికి హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మీ నాగేంద్ర బుధవారం ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేసి ప్రాణం నిలిపారు. తాను ఇప్పటి వరకూ 18 సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. రక్తం అత్యవసరమైనప్పుడు తనని సంప్రదిస్తే సేవా సంస్థ సభ్యులు ద్వారా రక్తం దానం చేస్తానన్నారు.

వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ సిటీ: మోదీ ప్రభుత్వం పేద మహిళలకి ఉచితంగా ఇస్తున్న గ్యాస్ కనెక్షన్లకు డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ బుధవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలెక్టరేట్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. పేద మహిళలకు ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ స్టౌ, రెగ్యులేటర్, సిలిండర్ అందజేస్తున్నారన్నారు. అయితే జిల్లాలో కొందరు దళారులు తయారై లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి వారిని మోసం చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల ధర్నా

కాకినాడ సిటీ: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు బుధవారం ధర్నా చౌక్ వద్ద నిరవధిక సమ్మెకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శిబిరానికి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు హాజరై మద్దతివ్వగా, సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువను గుర్తిద్దాం

- ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం
- కాకినాడలో భారీ బైక్ ర్యాలీ
- ప్లకార్డులు, జాతీయ జెండాలతో ప్రదర్శన
- పాల్గొన్న ఈఆర్వో, డీఆర్వో, ఉద్యోగులు


ర్యాలీని ప్రారంభిస్తున్న ఈఆర్వో నాగనరసింహారావు, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీరమణి


బెలూన్లను ఎగరేస్తున్న ఈఆర్వో నాగనరసింహారావు, ఇన్‌చార్జ్ డీఆర్వో శ్రీరమణి

కాకినాడ: ప్రజాస్వామ్యంలో ఓటు విలువను ప్రజలకు అర్థమయ్యేలా వివరించే లక్ష్యంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం కాకినాడలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించేలా ఓటర్లలో చైతన్యం కల్పించడం, భాగస్వాములను చేయడమే లక్ష్యంగా సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా ఈ బైక్ ర్యాలీ జరిగింది. స్థానిక రాజాట్యాంక్ పార్కు ఆవరణలోని రాగిరెడ్డి కళాక్షేత్రం నుంచి ప్రారంభమైన ర్యాలీని ఈఆర్వో సీహెచ్ నాగనరసింహారావు, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీరమణి ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలోని వంద సచివాలయాల నుంచి సుమారు వెయ్యి మంది కార్యదర్శులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులు, ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. ప్లకార్డులు, జాతీయ జెండాలు, స్వీప్ బ్యానర్లను చేతబట్టి అడుగడుగునా 'ఓటు హక్కును ఉపయోగించుకుందాం–ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అంటూ నినదించారు. రాజాట్యాంక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ త్రీలైట్స్ జంక్షన్, పొట్టి శ్రీరాములు విగ్రహం, జెడ్పీ సెంటర్, జీజీహెచ్, బాలాజీ చెరువు, సూపర్‌బజార్, మసీదు సెంటర్ గోల్డ్ మార్కెట్, జగన్నాథపురం మీదుగా ఎన్టీఆర్ వారధి నుంచి దేవాలయం వీధి, త్రిపురసుందరి ఆలయం, టూటౌన్ ఓవర్ బ్రిడ్జి మీదుగా భానుగుడి వరకు కొనసాగింది. ఈఆర్వో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని వచ్చే ఎన్నికల్లో తమ హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఇప్పటికే ఓటు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఓటు విలువను తెలుసుకోవాలన్నదే ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆనందభారతి గ్రౌండ్‌లో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇన్‌చార్జ్ డీఆర్వో, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏ సుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, తహసీల్దార్ సీతాపతిరావు, ఏఈఆర్వో మురళీకృష్ణ, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బలమైన ఆయుధం ఓటు

- కాకినాడ రూరల్ ఈఆర్వో కిశోర్
- ర్యాలీ, ప్రదర్శన, మానవ హారం


కాకినాడ రూరల్ నియోజకవర్గం అచ్చంపేట జంక్షన్ వద్ద ఓటర్ల అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఈఆర్వో, ఆర్డీఓ కిశోర్ తదితరులు

కాకినాడ రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని కాకినాడ ఆర్డీఓ, రూరల్ నియోజకవర్గ ఈఆర్వో ఈట్ల కిశోర్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో బుధవారం ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత తిమ్మాపురం పంచాయతీ పరిధిలో అచ్చంపేట జంక్షన్ నుంచి ఏపీఎస్పీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి యువత, ఉద్యోగులు, విద్యార్థులతో ప్లకార్డులతో సర్పవరం జంక్షన్ వరకు ప్రదర్శన చేపట్టారు. సర్పవరం జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ఓటర్లతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటరు తీర్పు చాలా బలమైనదన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం 60 నుంచి 70శాతం వరకు మాత్రమే నమోదవుతోందని, పూర్తి స్థాయిలో పోలింగ్ నమోదయ్యేందుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రూరల్ తహసీల్దార్ మురార్జీ, కరప తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎన్నికల డీటీ సురేష్, బూత్ స్థాయి అధికారులు, వీఆర్వోలు, కళాశాలల విద్యార్థులు, ఓటర్లు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ స్విమ్మింగ్‌లో షణ్ముఖ ప్రతిభ


షణ్ముఖను అభినందిస్తున్న ఆర్జేడీ నాగమణి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కృష్ణా జిల్లా బ్లూమింగ్ డేల్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించిన అండర్–14, 17 పాఠశాల క్రీడా సమాఖ్య స్విమ్మింగ్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన షణ్ముఖ ప్రతిభను కనపరిచిందని సమాఖ్య ముఖ్య కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఆదిత్య ఐఐటీ స్కూల్‌లో చదువుతున్న 800 మీటర్ల ఫ్రీస్టైల్, 400 మీటర్ల ఫ్రీస్టైల్, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగాల్లో ఆమె బంగారు పతకాలు సాధించింది. మెక్లారిన్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్జేడీ నాగమణి షణ్ముఖను అభినందించారు. ఈ పోటీకి కోచ్‌లు సురేష్, రాజు హాజరయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల నిమిత్తం కాకినాడ డి–4 సెక్షన్ పరిధిలో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ జి.ప్రసాద్ తెలియజేశారు. 11 కేవీ సింహాద్రినగర్, గంగరాజునగర్ ఫీడర్లపై గల గంగరాజు నగర్ రోడ్డు నంబరు 1 నుంచి 6 వరకు, శ్రీకాంత్ పబ్లిక్ స్కూల్, వలసపాలక మెయిన్ మెయిన్ రోడ్డు, చైతన్య స్కూల్ ఏరియా, గానుగ చెట్టు సెంటరు, శ్రీధర్ హాస్పటల్, తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

నిపుణుల వల్లే దేశాభివృద్ధి


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఆర్జేడీ నాగమణి తదితరులు

బాలాజీచెరువు: నైపుణ్యం కలిగిన వ్యక్తుల వలనే దేశాభివృద్ధి జరుగుతుందని విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి పేర్కొన్నారు. స్థానిక సాలిపేట బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కౌశల్ ప్రతిభ పోటీలు బుధవారం నిర్వహించారు. ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదలకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్ర సాంకేతిక రంగాలలో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ అంశాలలో 432 మంది పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 30న నిర్వహించే పోటీలలో పాల్గొంటారన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, డీవైఈఓ డేనియల్ రాజు, అర్బన్ డీఐ వాణికుమారి, కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా కాకినాడ


వై ఏపీ నీడ్స్ జగన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి


పాల్గొన్న లబ్ధిదారులు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 21వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్

కాకినాడ: కాకినాడను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 21వ డివిజన్ ఎంఎం ఫంక్షన్‌హాలులో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకినాడలో 10 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అంతకు మించి 33 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేశామని, దాదాపు రూ.1700 కోట్ల మేరకు నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల లబ్ధిని అందించామన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎంను మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీపీఆర్వో మానే కృష్ణమోహన్, స్థానిక నాయకులు అబ్దుల్ బషీరుద్దీన్, బొర్రా రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతే కేంద్రప్రభుత్వ ధ్యేయం


గురజనాపల్లిలో ఉచిత గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న అధికారులు, నాయకులు


వికసిత్ భారత సంకల్పయాత్ర పోస్టర్లను ప్రదర్శిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ వేటుకూరి, ఇతర నాయకులు

కరప: దేశప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వికసిత్ భారత సంకల్పయాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణరాజు పేర్కొన్నారు. మండలం గురజనాపల్లిలో బుధవారం సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికాన్ని నిర్మూలించి, వారి జీవన స్థితిగతులు మార్చాలని ప్రధాని దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. గత తొమ్మిదేళ్లలో 130 పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలను పేదలకు అందించాలన్న ఉద్దేశంతోనే వికసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయించి, ఉచిత గ్యాస్‌కనెక్షన్లు, ఆయుష్మాన్‌భవ కార్డులు తదితర పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉప్పలంకలో సర్పంచ్ బొమ్మిడి నయోమి అధ్యక్షతన ఈ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ కె.అప్పారావు, మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, మండల కోఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమ్మె


ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు

కాకినాడ సిటీ: సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ మెడికల్ రిప్రజెంటేటివ్‌లు బుధవారం ఒక రోజు దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడ పోస్టాఫీసు నుంచి బాలాజీ చెరువు మీదుగా జీజీహెచ్, జిల్లా పరిషత్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను పటిష్టంగా అమలు చేయాలని, మెడికల్ రిప్స్‌ను హైలీ స్కిల్డ్ ఎంప్లాయీస్‌గా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని వక్తలు పేర్కొన్నారు. మందుల రంగంలో ప్రభుత్వ కంపెనీలను బలోపేతం చేయాలని, ప్రైవేటు మందుల కంపెనీల ఆగడాలు అరికట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీని పని చేయించాలన్నారు. మెడికల్ రిప్‌లకు పని పద్ధతులు రూపొందించాలని, జియో ట్యాగింగ్ వంటి పద్ధతులు రద్దు చేయాలన్నారు. యూనియన్ నాయకులు సి.వెంకట్రావు, పలివెల వీరబాబు, ఎంఏ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నేడు సీఎం జగన్ జన్మదిన వేడుకలు

కాకినాడ: నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాకినాడలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పలు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటలకు నూతనంగా నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని ద్వారంపూడి ప్రారంభించనున్నారు. 10 గంటలకు పెద్ద మసీదు వద్ద పేదలకు కుట్టు మెషీన్ల పంపిణీ, సీఎం పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నారు. 10.30 గంటలకు మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో జగన్నాథపురం అన్నమఘాటీ స్కూల్‌వద్ద కంటి వైద్య శిబిరం జరగనుంది. అనంతరం సంజయ్‌నగర్ పిడిగులమ్మతల్లి గుడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

భక్తి శ్రద్ధలతో కాలభైరవాష్టమి పూజలు

సామర్లకోట: కాల భైరవ అష్టమి వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కాలభైరవస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మార్గశిర మాసంలో వచ్చే తొలి అష్టమిని కాలభైరవ అష్టమిగా నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయాన్ని పూలతో అలంకరించారు. భక్తులు తీసుకువచ్చిన గారెలు, పూల దండలతో స్వామివారిని అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, చందలాడ వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, భక్త సంఘం నాయకులు బిక్కిన పరమేశ్వరసాయి, బీవీ రమణ, చల్లా సత్తిబాబులు భక్తులకు సేవలందించారు.

సాత్విక్ సాయిరాజ్‌కు అభినందనలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌కు కేంద్ర ప్రభుత్వం ఖేల్‌రత్న పురస్కారం ప్రకటించడంపై ఒలింపిక్ సంఘ మాజీ కార్యదర్శి, సెంట్రల్ ఆర్గనైజింగ్ ఫర్ ఒలింపిక్ మూమెంట్ సభ్యుడు కె.పద్మనాభం బుధవారం అభినందనలు తెలిపారు. అతడు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రద్మనాభం ఆకాంక్షించారు.

శ్రీపాద వల్లభ దిగంబరా..!


మహా పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు

- దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం
- మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో బుధవారం దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలం కావడంతో పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలతో ప్రారంభమైన దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు.. వారం రోజుల పాటు జరుగుతాయని ఆలయ ఈఓ ఆర్ సౌజన్య తెలిపారు. తొలి రోజు స్వామివారి పల్లకీ సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పల్లకీ సేవ పట్టణ పుర వీధుల్లో జరగడంతో పలువురు భక్తులు తిలకించి తరించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా ఉంది. మహోత్సవాల సందర్భంగా దేశ నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.